

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ

## ప్రారంభమైన కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

● నేడు స్వామివారి కల్యాణమహోత్సవం

**కీసర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** ఆరు రోజుల పాటు జరిగే కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో నరేందర్ ఆధ్వర్యంలో వేద పాఠశాల పండితుడు గణపతిశర్మచే గణపతి పూజతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. మొదటిరోజు పూజల్లో భాగంగా ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవ మూర్తులను కీసరలోని వంశపారంపర్యంగా వస్తున్న నివాస గృహంలోకి తీసుకెళ్లారు.

బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు స్వామివార్ల ఉత్సవమూర్తులను పల్లకీసేవ ద్వారా కీసర గ్రామం నుంచి నడకదారి గుండా కీసరగుట్టకు తీసుకువస్తారు. శ్రవణ నక్షత్రయుక్త లగ్నంలో శ్రీ భవానీ శివదుర్గ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివార్ల కల్యాణమహోత్సవం నిర్వహిస్తారు.

### కోటి రూపాయలు కేటాయింపు

బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం కోటి రూపాయలు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం ఎలాంటి అవసరం ఉన్నా ఆలయ నిర్వాహకులు, జిల్లా కలెక్టర్ సమన్వయం చేసుకొని నిధులు వినియోగించుకోవడం జరుగుతుంది.

● ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం, రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన సత్రాలను ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు.



టీడబ్ల్యూజేఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్, ఫెడరేషన్ ప్రతినిధులు

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి కృషి

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**నల్లకుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలో తాను శాయశక్తులా కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) డైరీ-2024ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయమై తాను చొరవ తీసుకుని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, పిల్లి రాంచందర్, కార్యదర్శులు సలీమా, గుడిగ రఘు, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌యూజే డైరీ ఆవిష్కరణ



హెచ్‌యూజే డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌యూజే ప్రతినిధులు

**హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి):** రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు ఇస్తామని సమాచార, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. త్వరలో అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తుందన్నారు. హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్) డైరీని బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, బి.జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ట్రెజరర్ రాజశేఖర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, రాధిక, రాష్ట్ర నాయకులు రామకృష్ణ, హెచ్‌యూజే ఉపాధ్యక్షులు బి.దామోదర్, నాగవాణి, రమేష్, వీరేష్, విజయ, ప్రశాంత్ పాల్గొన్నారు.

## గాంధీలో ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

**అడ్డగుట్ట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** గాంధీ ఆస్పత్రి చరిత్రలో ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్సను చిన్నపిల్లల వైద్యుల బృందం విజయవంతంగా చేసింది. చిన్నపిల్లల విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా బైరాంగూడకు చెందిన మైథిలీ(8) కొంతకాలంగా దగ్గు, తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా తల్లిదండ్రులు అనేక ఆస్పత్రుల్లో వైద్యం చేయించారు. తగ్గకపోవడంతో ఈనెల 1న గాంధీ ఆస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలో చేర్పించారు. వైద్యులు చిన్నారికి ఎంఆర్‌ఐ టెస్టులతో పాటు వైద్య పరీక్షలు చేయించారు. చివరికి ఎమ్మారైలో బ్రాంకో జెనిక్ సిస్ట్ వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారణకు వచ్చారు. కేసు సవాల్‌గా తీసుకున్న గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావుతో పాటు గాంధీ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ఎస్.శ్రీనివాస్, మనోజ్, అశ్రిత్‌రెడ్డి, హర్ష, నాగార్జునతో కూడిన వైద్య బృందం శస్త్ర చికిత్స చేసి చిన్నారికి ఉపశమనం కల్పించారు.



ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీజీపీ రవిగుప్తా

## 18 నుంచి అఖిల భారత పోలీస్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ : డీజీపీ రవిగుప్తా

**హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ 16వ అఖిల భారత పోలీస్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఆతిథ్యమిస్తోందని డీజీపీ రవిగుప్తా తెలిపారు. హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 18 నుంచి 21 వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఛాంపియన్‌షిప్ పోటీల నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి తన కార్యాలయంలో సీనియర్ అధికారులతో కలిసి డీజీపీ రవిగుప్తా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 14 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి మొత్తం 440 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. మొత్తం 24 జట్లు పోటీ పడతాయని, నాలుగు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో సుమారు 745 మ్యాచ్‌లు జరుగుతాయని డీజీపీ వెల్లడించారు. అదనపు డీజీపీలు అభిలాషా బిస్త్, సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్, విక్రమ్ సింగ్ మాన్, స్టీఫెన్ రవీంద్ర, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐజీ ఎం. రమేష్ ఇతర కీలక అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# మరోసారి బీజేపీని గెలిపించాలి: ఎంపీ లక్ష్మణ్

**కవాడిగూడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** పది సంవత్సరాల్లో ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలేకేంద్రంలో మూడోసారి బీజేపీని అధికారంలోకి తీసుకొస్తాయని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె లక్ష్మణ్ అన్నారు. బుధవారం కవాడిగూడ డివిజన్ బండ మైసమ్మనగర్ కమ్యూనిటీ హాల్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా కవాడిగూడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు చిత్రకుమార్‌గౌడ్, బొల్ల రమేష్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సకల జనుల అభివృద్ధి కోసం మరోసారి రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



వీఎస్టీ చౌరస్తాలోని పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, కార్పొరేటర్ రవిచారి తదితరులు

### ముషీరాబాద్ అభివృద్ధికి కృషి

**రాంనగర్:** తనకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి తన సహకారం నిరంతరం ఉంటుందని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. తాను యూపీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైనప్పటికీ ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తానన్నారు. నియోజకవర్గంలోని రాంనగర్ డివిజన్‌లోని వీఎస్టీ పార్కుతోపాటు గాంధీనగర్, కవాడిగూడ, ముషీరాబాద్ డివిజన్లలోని పార్కులలో ఓపెన్ జిమ్‌లు, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంపీ నిధుల నుంచి రెండు కోట్లను కేటాయించామన్నారు. బుధవారం వీఎస్టీ చౌరస్తాలోని జీహెచ్‌ఎంసీ నిర్వహిస్తున్న పార్కులో 10.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసే ఓపెన్ జిమ్‌లను కార్పొరేటర్ కె.రవిచారి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, నాయకులు ఉపేందర్, శ్రీనివాస్, గడ్డంనవీన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీ ఎన్నికల్లో సమష్టిగా..

**చిక్కడపల్లి:** రాబోయే పార్లమెంటుఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్‌కన్వీనర్‌గా నియమితులైన బీజేవైఎం పూర్వ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ తన నియామకం సందర్భంగా లక్ష్మణ్‌ను బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. అనంతరం వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. బీజేపీ ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రమేశ్‌రామ్, కో కన్వీనర్‌నవీన్‌గౌడ్, ప్రభారి అశోక్, రమేశ్‌గౌడ్, మహేష్, నాయకులు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు

**బర్కత్‌పుర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** కాచిగూడ డివిజన్ పరిధిలోని అన్ని బస్తీలలో డ్రైనేజీ, వరదనీటి కాలువల్లో యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని కాసీరామ్‌జీరా, ఇందిరానగర్‌లలో చేపట్టిన పూడికతీత పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, జీహెచ్‌ఎంసీ డీఈ రఘు, ఏఈ సబిత, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమానికి మోదీ పెద్దపీట

**బర్కత్‌పుర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిన ప్రధాని మోదీ దేశంలోని మహిళలందరికీ ఆదర్శంగా నిలిచారని బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె.గీతామూర్తి అన్నారు. బుధవారం అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో నారీశక్తి వందన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో కె.గీతామూర్తి మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో మహిళలంతా మోదీకి అండగా నిలవాలని కోరారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**బర్కత్‌పుర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** పట్టాలు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని రైలు ఢీకొంది. దీంతో ఆయన మృతిచెందాడు. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పుగూడ రైల్వే స్టేషన్ సమీపంలో 45 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జీవశాస్త్ర రంగంలో హబ్‌గా హైదరాబాద్

**బర్కత్‌పుర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** జీవశాస్త్ర రంగంలో హబ్‌గా హైదరాబాద్ మారిందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్ అన్నారు. బ్రిటీష్ కౌన్సిల్‌తోపాటు ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుని ఉన్నత విద్యా పరిశోధనలో తెలంగాణ ముందుకు సాగుతోందన్నారు. బుధవారం నిజాం కళాశాలలో మైక్రో బయోలజీ జాతీయ సదస్సు నిర్వహించారు. మైక్రోబయోలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీలలో నియామకాలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ చాంద్ పాషా, కంట్రోల్ అకాడమీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ప్రొఫెసర్ బి.రంగారెడ్డి, ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎల్.వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ గీతశర్మ, నిజాం కళాశాల మైక్రోబయోలజీ ఫ్యాకల్టీ డాక్టర్ అంజురాజు, కో-ఆర్డినేటర్ డాక్టర్ సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ పీపీ, అసిస్టెంట్ పీపీలను యథావిధిగా కొనసాగించాలి

**బర్కత్‌పుర, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలోని హైకోర్టు ఇతర న్యాయస్థానాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌ను యథావిధిగా కొనసాగించాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తిమ్మన నవీన్‌రాజు మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారిని యథావిధిగా కొనసాగించాలని లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## సికింద్రాబాద్, భువనగిరి, నల్గొండ ఎంపీ స్థానాలను రజకులకు కేటాయించాలి

**రాంనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు సికింద్రాబాద్, భువనగిరి, నల్గొండ పార్లమెంట్ స్థానాలను రజకులకు కేటాయించాలని చాకలి ఐలమ్మ విజ్ఞాన కేంద్రం చైర్మన్ అమనగంటి. సైదులు డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్థిక, విద్య, రాజకీయ, సామాజిక రంగాల్లో వెనుకబడి ఉన్న రజకులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రజక సంఘం నాయకులు వడ్లకొండ ఆంజనేయులు, చాకలి రాజీవ్, కుప్పల యాదయ్య, నేరెళ్లకుమార్, అక్కినపల్లి కృష్ణ, మనోహర్, శ్రీలత, లక్ష్మి పాల్గొన్నారు.

## మసీదు నిర్మాణానికి శంకుస్థాపన

**ముషీరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో మసీదే హజ్రత్ ఆజామ్ నూతన మసీదు నిర్మాణానికి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గౌస్‌ఉద్దీన్, మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీ నాయకులు మహ్మద్‌అలీ, నూర్‌ఉల్ అసన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంక్‌బండ్‌పై శివశంకర్ విగ్రహం ఏర్పాటు..

**కవాడిగూడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** న్యాయకోవిదులు, న్యాయశిఖరం పుంజాల శివశంకర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని బీసీ సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, తెలంగాణహిందూ బీసీ మహాసభ, జాతీయ బీసీ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో పండుగ సాయన్న స్ఫూర్తి స్థలం నుంచి కిలాషాపూర్‌లోని సర్దార్ సర్వాయ్ పాపన్న కిల వరకు జరిగే పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ యాత్ర ర్యాలీగా బుధవారం మెహిదీపట్నం నుంచి బయలు దేరి, అమరవీరుల స్థూపం, కొండాలక్ష్మణ్ విగ్రహం మీదుగా వెళ్లి ట్యాంక్‌బండ్‌పై సభ నిర్వహించారు.

## భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

**బర్కత్‌పురా, మారి 6 (ఆంధ్రజ్యోతి):** భార్యపై కత్తితో భర్త దాడి చేయడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. కాచిగూడ ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూనగర్‌లో నివాసముంటున్న ఫక్రుద్దీన్(81) ఆర్టీసీలో ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యాడు. ఇతనికి భార్య, నలుగురు కుమారులు, ఐదుగురు కూతుర్లు ఉన్నారు. ఫక్రుద్దీన్ ఆస్తులను కుటుంబ సభ్యులకు తెలియకుండా విక్రయిస్తున్నాడు. ఈ విషయంలో కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం తలెత్తిన వివాదంతో ఫక్రుద్దీన్ కత్తితో భార్య షాజాదీబేగం(75)పై దాడి చేశాడు. దాడిలో భార్య తల, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. షాజాదీబేగంను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. భర్తను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ అర్చన, బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధి సురేఖ, డిపో మేనేజర్ కిషన్‌రావు తదితరులు

## ఆర్టీసీ ముషీరాబాద్ డిపోలో మహిళా దినోత్సవం

**రాంనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** ఆర్టీసీ ముషీరాబాద్ 2 డిపో ఆధ్వర్యంలో బుధవారం డిపో ఆవరణలో మహిళా దినోత్సవాన్ని డీఎం కిషన్‌రావు సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ అర్చన, బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధి సురేఖ హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముషీరాబాద్ డిపో 2లో అత్యధికంగా కలెక్షన్(కేపీకే) సాధించిన ముగ్గురు మహిళా కండక్టర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డిపో ఆర్టీసీ టెక్నికల్ ఏఎం వి.కల్యాణి, ఏఎంపీ జ్యోతి, ఏఎంఈ చందర్ సిబ్బంది పాల్గొన్నారు.

● **హైదరాబాద్:** బషీర్‌బాగ్ పర్యాటక సంస్థ రిజర్వేషన్ కేంద్ర కార్యాలయంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యాటక సంస్థ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పోటల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

## రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో సమానత్వం కల్పించాలి: ఐద్వా

**రాంనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** మహిళలకు రాజకీయ రంగంలో ఆర్థిక సామాజిక రంగాలలో సమానత్వం కల్పించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర మహిళా కన్వీనర్ రమాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి, పద్మశ్రీల అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వేచ్ఛ సమానత్వం స్త్రీ విముక్తి కోసం జరిగే పోరాటాలకు స్ఫూర్తినిచ్చే రోజు 8 గంటల పనిదినం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఆరిబండి ప్రసాద్, యూటీఎఫ్ నాయకులు వందన, సీఐటీయూ కార్యదర్శి జె.వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఎస్ఎఫ్ఐ కన్వీనర్ మమత, డీవైఎఫ్ఐ కన్వీనర్ శృతి, ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి, శశికళ, వినోద, సృజన, పద్మ, షబానా పాల్గొన్నారు.

## ఇంటిదారి కోసం టీచర్ పోరాటం




కవాడిగూడ సీజీవో టవర్స్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత టీచర్ సుధారాణి

**కవాడిగూడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** ఇంటిదారి కోసం ఓ దళిత మహిళా ఉపాధ్యాయురాలు ఏపీలోని వైసీపీ ప్రభుత్వంతో పోరాటం చేస్తోంది. ఐదు సంవత్సరాలుగా వైసీపీ పార్టీకి చెందిన గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే ముస్తాఫా ఆయన సోదరుడు షేక్ అబ్దుల్ కర్నుమా, నేరేళ్ల వెంకటేశ్వర్లు, మరోఏడుగురు ఇంటికి దారివ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ చంపుతామని బెదిరిస్తున్నారని, ముగ్గురు పిల్లలతో బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నానని ఆమె తీవ్ర ఆవేదనవ్యక్తం చేశారు. ఏపీలోని అద్దంకి మండలం గాజులపాలెం ప్రభుత్వ పాఠశాలలలో సెకండ్ గ్రేడ్ టీచర్ సుధారాణి చేసేది ఏమీ లేక, హైదరాబాద్ నగరంలోని సీజీవో టవర్స్‌లో ఉన్న జాతీయ ఎస్సీ, ఎస్టీ హక్కుల కమిషన్ డైరెక్టర్ సునీల్‌ను బుధవారం కలిసి ఫిర్యాదు చేశారు. తరువాత ఆమె కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ స్పందించి తగిన న్యాయంచేయాలని ఆమె కోరారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి మోదీ చేయూత

**ముషీరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాలలో రాణించే విధంగా ప్రధాని మోదీ చేయూతనిస్తున్నారని కార్పొరేటర్లు సుప్రియా నవీన్‌గౌడ్, రచనశ్రీ అన్నారు. బుధవారం ముషీరాబాద్‌లోని హెరిటేజ్ హాల్‌లో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శక్తివందన్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ కార్యక్రమాన్ని నిర్వహించారు.



సదస్సులో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, ప్రొఫెసర్ కోదండరాం తదితరులు

## మహిళా బిల్లులో బీసీ సబ్ కోటా ఇవ్వాలి

**బర్కత్‌పుర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) :** మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్‌కోటా కల్పించినప్పుడే రాజ్యాధికారం దక్కుతుందని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం తెలంగాణ ఐక్య వేదిక మహిళా అధ్యక్షురాలు కరుణశ్రీ అధ్యక్షతన రెండు తెలుగు రాష్ట్రాల మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీ మహిళలకు 5 ఎంపీ సీట్లు కేటాయించాలని, నామినేటెడ్ పోస్టులలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రంలోని బెల్ట్‌షాపులను పూర్తిగా మూసివేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మాజీ ఎంపీ అజీజ్‌పాషా, ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలుల ఇందిరాశోభన్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, పలు బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌కు దూరంగా ఎమ్మెన్

### కాంగ్రెస్ వైపు అడుగులు?



**రాంనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** బీఆర్‌ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించి నిరాశతో ఉన్న బీఆర్‌ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పార్టీలో కొనసాగాలా లేదా మరో పార్టీలోకి వెళ్లాలా అనే అంశంపై ఆయన తేల్చుకోలేకపోతున్నారు. బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన ఎంపీ స్థానాలు వచ్చే అవకాశాలు లేకపోవడం వల్ల ఎమ్మెన్, రాజకీయ భవిష్యత్ కోసం నూతన మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో రెండోసారి గెలిచిన ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఎమ్మెన్‌ను, ఆయన వర్గాన్ని దూరం పెట్టారు. దీంతో పార్టీ వీడితేనే బావుంటుందని ఎమ్మెన్ భావిస్తున్నట్లు ఆయన అనుయాయులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల జరిగిన నియోజకవర్గం కార్యకర్తల సమావేశానికి, బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఎమ్మెన్ పాల్గొనలదని తెలిసింది. పార్టీ మారితే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లోకి వెళ్లాలా లేదా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలోకి వెళ్లాలా? ఏ పార్టీ తనకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తుందనే అంశంపై చర్చిస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీలోకి వెళితే తనకు తన అనుచరులకు రాజకీయగుర్తింపు వస్తుందని ఆయన భావిస్తున్నట్లు అనుచరులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఆయనతో కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు చర్చించినట్లు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికలలోపు తన భవిష్యత్ నిర్ణయానికి ఎమ్మెన్ రానున్నట్లు స్పష్టమవుతుంది.

## అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు: ఎమ్మెల్యే కాలేరు

**అంబర్‌పేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** అంబర్‌పేట నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులలో అధికారులు ఎలాంటి అలసత్వం కూడా వహించవద్దని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట డివిజన్ రఘునాథ్‌నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

## డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభం

**గోల్నాక, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** గోల్నాక డివిజన్‌లోని వడ్డెరబస్తీలో రూ.15.30లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను బుధవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు బస్తీలో పర్యటించి ప్రజలను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గండికోట జనార్దన్, బోదాసు శేఖర్, కొంపల్లి లక్ష్మణ్‌గౌడ్, సినర్సింగ్‌ముదిరాజ్, అధికారులు పాల్గొన్నారు.

## 20 రోజుల్లో సమస్యలు పరిష్కారం: ఎమ్మెల్యే

**ముషీరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** ముషీరాబాద్ డివిజన్ బాప్టిస్ట్ చర్చి వీధిలో 20 రోజుల్లో కలుషిత నీటి సరఫరా, అధ్వానపు రోడ్డును ఆధునికీకరిస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజల ఫిర్యాదు మేరకు బుధవారం ఎమ్మెల్యే జలమండలి ఏఈ సాయి, జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్, డీఈ గీతాకుమారి, ఏఈ మురళితో కలిసి బస్తీలో పర్యటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... భవిష్యత్‌లో బాప్టిస్ట్ చర్చి వీధిలో వర్షపు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఫాస్ ఫిలిం సొసైటీ వార్షికోత్సవం

**చిక్కడపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** ఫాస్ ఫిలిం సొసైటీ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కొంపల్లిలోని అద్భుత హర్ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించిన కార్యక్రమంలో సాహితీవేత్తలు డా.ఓలేటి పార్వతీశం, ఆధ్యాత్మికవేత్తలు డా.అనంలక్ష్మి, కంచర్ల వెంకటరమణ, హస్తకళాస్రష్ట డా.కమలాప్రసాదరావు పాల్గొన్నారు. సినీనటి కవిత, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, నటులు జెన్నీ, వెంట్రిలాక్విస్ట్ మిమిక్రీశ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ గ్యాలరీ ఎండీ పీవీఎస్ ప్రసాదరావు, సినీనటులు పాల్గొన్నారు.

## ప్రసాద్‌మంగినకు అక్కినేని పురస్కారం



ప్రసాద్ మంగిన

**చిక్కడపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** బే ఏరియా తెలుగు అసోసియేషన్(బాటా) సలహాదారు ప్రసాద్ మంగినకు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా మిలిపిటాస్(అమెరికా) నగరంలో కలవెండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్కినేని సాంస్కృతిక సేవా పురస్కారం త్వరలో ప్రదానం చేయనున్నట్లు కలవెండి ఫౌండేషన్ రథసారథి కేఎస్.మూర్తి, సలహాదారు డా.కె.ధర్మారావు తెలిపారు. చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని కలవెండి ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రసాద్ భారతీయ కళలకు, సంగీతానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో తానా పూర్వఅధ్యక్షుడు కోమటి జయరామ్, ప్రముఖ వ్యాఖ్యాత్రి విజయలక్ష్మి ఆసూరి, బాటా అధ్యక్షుడు కొండల్ పాల్గొంటారన్నారు.

## మనల్ని మనం తెలుసుకుని ముందుకు సాగితే ఆత్మశాంతి

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):** మనల్ని మనం తెలుసుకుని ముందుకు సాగితేనే ఆత్మశాంతి లభిస్తుందని ఎస్‌బీఐ మాజీ మేనేజర్, బ్రహ్మకుమారీ సభ్యులు, ప్రముఖ ప్రవచనకర్త త్రినాథ్ అన్నారు. చిక్కడపల్లి బ్రహ్మకుమారి సంస్థ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి ఆలయంలో భగవద్గీత, రాజయోగ అంశంపై ఆయన మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రసంగం చేశారు. బ్రహ్మకుమారీ చిక్కడపల్లి శాఖ ఇన్‌చార్జి జయశ్రీ మాట్లాడుతూ త్రినాథ్ రెండువేల ప్రసంగాలు చేశారని వివరించారు.



ద్వాదశ జ్యోతిర్లింగ దివ్యదర్శనం కార్యక్రమంలో బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు శ్రీలత, సరోజిని, చంద్రప్ప, బాల్‌రాజ్ తదితరులు

## గుండు చౌరస్తాలో ద్వాదశ జ్యోతిర్లింగ దివ్యదర్శనం

**రాంనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** మహాశివరాత్రిని పురస్కరించుకుని బ్రహ్మకుమారీ రాజయోగ మెడిటేషన్ సంస్థ ఆధ్వర్యంలో రాంనగర్ గుండు చౌరస్తాలో ద్వాదశ జ్యోతిర్లింగ దివ్యదర్శన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు శ్రీలత, సరోజిని, చంద్రప్ప, బాల్‌రాజ్ తదితరులు మాట్లాడారు. శివరాత్రి పండగ సందర్భంగా జ్యోతిర్లింగాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసేందుకు శివరాత్రి వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జ్యోత్స్న వెంకన్న, చాణక్య, రాజేశ్వరి, ప్రమీల, బాల్‌రాజ్, చంద్రప్ప, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలపై సత్వర చర్యలు తీసుకోవాలి

**నల్లకుంట:** బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పలుచోట్ల నెలకొన్న విద్యుత్ సమస్యలను ఆ శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి సూచించారు. ఏడీఈ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో కార్పొరేటర్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చెంగలి చంద్రమోహన్, నాయకులు పాల్గొన్నారు.

## పరీక్ష తేదీల ప్రకటనపై నిరుద్యోగుల నిరసన

**చిక్కడపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** గ్రూప్-2 గ్రూప్-3 ఉద్యోగఖాళీల సంఖ్య పెంచకుండా పరీక్షల తేదీలు ప్రకటించడం పట్ల పలువురు నిరుద్యోగులు బుధవారం రాత్రి అశోక్‌నగర్‌లో నిరసన వ్యక్తం చేశారు. పోస్టుల సంఖ్యను పెంచి తేదీలను ప్రకటించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు చర్యలు తీసుకోవాలి

**బర్కత్‌పుర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు మాదిగ డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.